# తీర్పు



## సింహప్రసాద్

**అ**దో చిన్న పల్లెటూరు. దాని పేరు

ఆంధ్రదేశంలోని ఏవూరి పేరైనా కావచ్చు అలాటి వూళ్ళు ఒక్క ఆంధ్రలోనేకాదు బీహార్లో, ఉత్తర ప్రదేశ్‌లో, తమిళనాడులో ఎక్కడైనా వుంటాయ్.

ఆ వూళ్ళోనిపల్లె అది

ఆ పల్లెలో ఓ చిన్న గుడిసె ముందున్న నులకమంచంమీద అప్పుడు కూర్చునున్నాడు అతడు చాలా విచారంగా వున్నాడని చూడగానే తెలిసి పోతుంది. అలా వున్నాడు. అతడి

పుదురు ఎడమచేతి వ్రేళ్ళ మధ్య ఇరుక్కునివుంది. అతడి వెన్ను వెదురు బద్దలా వంగి వుంది. తాటి తొక్కలా నల్లగావున్న శరీరంలోంచి ప్రక్క ఎముకలు అతి స్పష్టంగా సైన్సు విద్యార్థులు నేర్చుకోడానికి అనువుగా కన్పిస్తున్నాయ్. కళ్ళు తెల్లని గుబురు లాంటి కనుబొమ్మల మాటున నక్కి వున్నాయ్. కొల్లాయి మాత్రం కట్టు కున్నాడు. అంతకు మించి ఒంటిమీద దుస్తులేం లేవుగాని ఒళ్ళో మాత్రం తువ్వాలూ గాక గుడ్డముక్కగాని తువ్వాలుగా వుపయోగపడే తోలులాంటి గుడ్డ ఒకటుంది. అతడి తలమీద వెంట్రుకలు అతడి వయస్సు యాభై అంటోంటే అతడి ఒంటి ముడతలు (అవి తోళ్ళలా వేలాడుతున్నాయ్) యాభైఅయిదు అంటున్నాయ్.

కాని— "ఇప్పుడేం చెయ్యడంరా దేవుడా" అన్నట్టున్న భంగిమలో కూర్చున్న అప్పుడు మరింత వయస్సు వచ్చినట్లుగా వున్నాడు.

మేకపిల్లొకటి దాని చెవులు కొయ్యక పోయినా కోసినట్టే "మే- మే" అంటూ అరుస్తూ కలతిరుగుతోంది, అ ప్రక్కనే పాతిన కర్రకి వ్రేలాడదీసిన సీమ చింత కొమ్మ చుట్టూ. ఆ కొమ్మకింకా చాలా ఆకులున్నాయ్. కానీ అది తినడం లేదు. సరిగ్గా నిలవటమూలేదు. దేని కోసమో ఆరాటంగా గాభరాగా కల తిరుగుతోంది!

పులిక్కిపడి మేకపిల్లవంక చూశాడు బాధగా అప్పుడు. కళ్ళ ముందు కన్న కొడుకు 'నాన్నా' అంటూ బావురుమని ఏడుస్తున్నట్టే అవిపించింది. అప్రయత్నంగా రెండంటే రెండు కన్నీటిబొట్లు రాలి జారిపడి ముక్కలై చెదిరిపోయాయ్.

గబుక్కున లేచెళ్ళి మేకపిల్లని చేతిలోకి తీసుకొని నిమురుతూ "వూర్కోవే వూరుకోవే పిచ్చిముండా. మీ అమ్మని ఎతికి తెస్తానే. వూరుకోవే. ఇంద ఈ గడ్డి తినే" అంటూ లేతపచ్చ గడ్డిపరక లందిచ్చాడు గాని అది అందుకోలేదు. వూరికే 'మే మే' అంటూ ఏడుస్తోంది దీనంగా!

దాని బాధ చూళ్ళేక లేచి మేకపిల్ల మెడకి 'పలుపు' తగిలించి గబుక్కున వంగి దాని మూతిని ముద్దుపెట్టుకుని "ఏమే!" అని ఇంటిదాన్ని పిలిచాడు.

"వస్తన్నా"

"నేనలా వూళ్ళో కెళ్ళొస్తానే"

"యేం?" గుడిసెలోంచి వస్తూ అడిగిందతడి భార్య.

"మేక కోసం ఎతికొస్తానే" ఎంచేతో అతడి కళ్ళల్లోకి నీళ్ళు పొంగాయ్!

"నిన్నా మొన్నా ఎదికేవుగందా?"

"మళ్ళి చూసొస్తనే. బుజ్జిదాన్ని సూస్తూండు" అన్చెప్పి చేతికర్ర తీసుకుని

విసురుగా నడవసాగాడు అప్పుడు వూరి వైపు.

వయస్సుడిగిన అప్పడికా కర్ర చాలా సాయంగా వుంటూంటుంది అది కేవలం వూతకర్రే కాదు అతడికెంతో ధైర్యాన్ని ఇచ్చే సాధనం కూడానూ తన శక్తి కది చిహ్నంగా భావిస్తూంటాడు కూడానూ ఎన్నడూ ఆ కర్రవి ఇతరుల మీదకి ఎత్తాల్సి రాకపోయినా ఒక్క మాటలో చెప్పాలంటే చేతిలో ఆ కర్ర వుంటే భయా లతడి దరిజేరవే. అతడెవరికీ భయపడడు।

ఇక్కడ కథని ఒక క్షణం ఆపి 'ఫ్లాష్ బాక్' లో కెళ్ళడం చాలా అవసరం.

అప్పుడు ఇదివరకు పాలేరుగా పని చేసేవాడు కాని వయస్సు వుడిగి పోవడంతో ఎవరూ అతడ్ని పాలేరుగా పెట్టుకోవడంలేదు అయినా రెక్కాడితే గాని డొక్కాడని బ్రతుకులు గనుక కూలి దొరికిన రోజున మొగుడూ పెళ్ళా లిద్దరూ కూలి కెళ్తూంటారు పండ్ల సీజనైతే తోట కాపలాకి కుదుర్తూంటాడు అదీ ఇదీ లేనప్పుడు పచ్చగడ్డి కోసి వూళ్ళో అమ్ముతూంటాడు. మొత్తానికి బ్రతికున్నారు గనుక ఏ 'బలుసాకో' తింటూ రోజులు దొర్లించేస్తున్నారు।

ఓ నాలుగు మేకపిల్లల్ని కొని ఎలా గోలా పెంచితే, అవి పెద్దైతే, పాలివ్వడమేగాక అవసరానికి అదు కుంటాయని చానాళ్ళు ప్రయత్నించగా ఆఖరికో మేకపిల్లని మాత్రం కొన గలిగాడు. గడ్డీ గాదం తిని అది పెద్ద దయ్యింది. సూడిదై ఓ పిల్లనే ఈనింది. అంచేతే కాబోలు దరిద్రుడు ఏ రేవు కెళ్ళినా ముళ్ళ పరిగెలే అంటారు। ఇంతలో వాళ్ళమ్మాయి పెళ్ళవ్వడంతో పెళ్ళిఖర్చుగ్గాను తల్లిమేకని అమ్మెయ్యక తప్పలేదు.

మిగిలిన పిల్లమేక పెద్దదైతె రెండు పిల్లల్ని ఈవిందిగాని ఒకటి వాతం కమ్మి చచ్చిపోయింది ప్రస్తుతం తల్లి మేకా పిల్ల మేకా వున్నాయ్.

అ తల్లిమేకే ఈ కథలోని 'హీరో'.

ఆ 'హీరో' మేక అంటే అప్పడికీ అతడి భార్యకీ ఎంతో ఇష్టం ఎంచేతంటే అది 'ఇంటికి' పుట్టిన మేక. వాళ్ళు ప్రేమగా అందిచ్చిన లేత గరికలందుకుని తిని పెరిగిన మేక అంతేగాక దాని పిల్ల పాలిడిచేశాక దాన్ని అమ్మి ఆ డబ్బుతో చీరకొని తమ కూతురికి పెట్టాలని వారి కోరిక. పెళ్ళికి తప్ప మళ్ళీ ఈ రెండేళ్ళలో ఒక్క గుడ్డముక్క కూడ కొని పెట్టలేకపోయిన కూతురికి ఈ మేక పుణ్యమా అంటూ కొనిపెట్టాలని వారి తాపత్రయం

కాని రెండ్రోజుల క్రితం తల్లిమేక తప్పిపోయింది।

రోజూలానే అవాళా మేకల్ని తోలు కుని పొలం వెళ్ళి వాటిని కాస్త ఆకు

లెక్కువున్న పొదలవైపు తోలి తాను పచ్చగడ్డి కోసుకోసాగాడు అప్పుడు. ఇంతలో రాఘవరావు కాపు అటుగా వచ్చాడు అప్పుడిని చూసేసరికి ఆయన కేదో గుర్తుకొచ్చింది

"ఒరే అప్పిగా— ఇలారా" పిల్చా రాయన

చేస్తున్న ప ని నా పి పరుగునెళ్ళి రామచంద్రమూర్తి ముందు ఆంజ నేయుళ్ళా నిలబడ్డాడు.

"ఈ చీటీ జాగ్రత్తగా పట్టుకెళ్ళి మా అబ్బాయి కివ్వరా. ఇంటికాడే వుంటాళ్ళే త్వరగా వెళ్ళు వాడిప్పుడు పట్నం వెళ్తున్నాడ్రా నేను దీన్నివ్వడం మరచి పోయి వచ్చేశాను నేనిలా తోటలోకెళ్ళి ఇంటికెళ్ళేప్పటికి వా డె ళ్ళి పో తా డు. పరుగు నెళ్ళాలి సుమా!"

మేకల వంక చూసాడు అప్పుడు అవి ఏమీ ఎరగనట్లు మేస్తూనే వున్నాయి. చేతిలో రెపరెప లాడుతున్న చీటీవంక చూశాడు తను వూళ్ళోకెళ్ళి వచ్చేలోపున మేకలు ఆ ఆకు మడిలోనైనా పడితే చాలా గొడవవుతుందని ఇబ్బంది పడ్డాడు అలా అని ఈ పెద్దకాపు మాట కాదనగల ధైర్యం లేదు ఎలా అని సతమతమౌతూంటే "బేగే పరుగెట్రా— లేపోతే అబ్బాయెళ్ళిపోతాడు పట్నం" అని తొందర పెట్టేరాయన.

ఇంకేమీ ఆలోచించకుండా పరుగె త్తాడు నిజానికది నడకే అయినా దాన్ని పరుగు అనడమే సమంజసం!

రాఘవరావుగా రబ్బాయికి చీటీ అందిచ్చి తిరిగొచ్చి చూసేసరికి తల్లి మేక కన్పించలేదు. మేకపిల్ల మాత్రం 'మేమే' అని ఏడుస్తూ కలతిరుగుతోంది.

బిడ్డని వదిలి ఎక్కడి కెళ్ళిందబ్బా అని ఆ చుట్టు ప్రక్కలంతా వెదికాడు కన్పించిన వాళ్ళందర్నీ అడిగాడు. లాభం లేకపోయింది దుఃఖం ముంచు కొస్తోంటే అతి కష్టంమీద నిగ్రహించు కుంటూ వూళ్లోకూడా వెదికాడు ఎవరైనా ఆకుమడిలో పడిందని బందెలదొడ్డిలో పెట్టారేమోనని వెళ్ళి చూసాడు గాని తల్లిమేక కన్పించలేదు

ఇది జరిగి రెండ్రోజులైపోయింది.

అయినా ఆశ చావక దారితప్పి పక్కూరెళ్ళిపోయిందేమోనని అక్కడా వెదికి ఇంతక్రితమే వచ్చాడు అప్పుడు. మళ్ళీ మేకపిల్ల గోల చూళ్ళేక వూళ్లోకి నడిచాడు


మళ్ళీ బందెలదొడ్డిలో చూశాడు

లేదు

పి చ్చి వా ళ్ళా వూరిచుట్టూవున్న కంచెల్లో తోటల్లో వెదుకుతూంటే ఇంకో పాలేరు అడిగాడు "ఏంట్రా మావా ఎదుకుతున్నావ్" అని.

"నా మేక - మేక తప్పిపోనాద్రా ఎంకటేశ్లూ" నా జీవన సర్వస్వం పోయిందన్నట్టుగా వున్నాయ్ అతడి మాటలు!

"ఎప్పుడు దాన్నొదిసి వుంటావ్ —




ఎలా పోయిందిరా? అన్నట్టొరే మావా భూషణంగారి సాల్లోంచి మేక అరుపు విన్పించాయిరా నిన్న ఆరు గిని కట్టేశా రేమో సూద్రా" అన్నాడు

ఆ మాట చెవినిపడటం తరువాయి పరుగులాంటి నడకతో భూషణంగారి పశువుల కొట్టంలో కెళ్ళాడు

ఓ ప్రక్కన తన మేక కన్పించింది. ప్రక్కనే మేతవున్నా తినకుండా దిగులుగా చూస్తోంది కన్నీరు కారుస్తూ।

"నా తల్లే నా బుజ్జే - ఎన్నాళ్ళకి కన్పించావే" అంటూ సంబరంగా దగ్గర కెళ్ళి దాని మెడని కావలించుకుని ఏదేదో గొణుక్కుంటూ దాని ఒళ్ళంతా నిమిరి నిమిరి దాని మెడకి కట్టివున్న పలుపు విప్పబోయే ఆగిపోయాడు - కాపుని అడక్కుండా విప్పితే కూకలేస్తాడని గుర్తురాగానే.

విషయం కాపుకి చెబుదా మనుకుని లేచి పైమీద గుడ్డతో కళ్ళొత్తుకుంటూంటే భూషణంగారి పాలేరొచ్చి "ఏరా అప్పిగా ఇలా వచ్చావ్" అన్నాడు

"ఈ మేక నాదేరా మొన్నచేల తప్పిపోనాది" దిగులుగా అన్నాడు

వాడు చాలా ఆశ్చర్యపడ్డాడు ఎంచేతంటే ఆ మేకని అమ్మకాని కొస్తే తాను కొన్నానని భూషణంగారు చెప్పేరు క్రితంరోజునే।

"మరి మా కాపు ఆ మేకని కొన్నానని సెప్పేర్రా"

"అరినాయనోయ్ అట్లా అంటే నేనెట్లా పచ్చేదిరా. నే నమ్మలేను నా తోడ్రా. మొన్న 'గరువు'లో మేకల్ని మేపుతూంటే రాఘవరావు కాపుగారు పనిమీద వూళ్ళోకంపితే వచ్చినా. తిర

గొచ్చి చూసేప్పటికి మేకపిల్ల వుంది గాని ఇదిగో ఈ పిచ్చిముండ కనబళ్ళే దురా" అన్నాడు అప్పడు మేకని చూపుతూ

"మరైతే కాపు నడుగు ఏవంటరో''

ఒకవేళ వారి అకుమడిలో పడితే బందెలదొడ్డిలో పెట్టాలి లేకపోతే తనని పిలిచి నాలుగు తిట్టాలి కొట్టాలిగాని మేకని ఆయన కొన్నానని చెప్పడం ఏమిట్రా భగవంతుడా అని గాభరాపడి పోతూ భూషణంగారి ఇంటి వీధిగుమ్మం వైపు వెళ్ళాడు.

భూషణంగారు వీధి అరుగుమీద వాలు కుర్చీలో కూర్చుని చుట్ట చుట్టు కుంటున్నారు.

"దండాలండయ్యగారూ''

"ఎవరూ?''

"నేనండయ్యగారూ అప్పడ్ని"

''ఏంరా.''

"నా మేక తప్పిపోనా దయ్యగారు మొన్నటేల మీ దొడ్లో కట్టేసింది నా మేకేనండయ్యగారూ '' ఆశగా చూస్తూ అన్నాడు అప్పడు

భూషణంగారు వులిక్కిపడ్డారు. సర్దుకోడానికి రెండు క్షణాలు పట్టింది కూడానూ - తర్వాత తాయితీగా అన్నారు, "దాన్ని మేం కొన్నాంరా మరి వాడెవడో పట్టుకొచ్చి అమ్మితేనూ డెబ్బై రూపాయలకి కొన్నాం మా అమ్మాయి పెళ్ళిలో వేట వెయ్యడానికి వుపయోగపడుతుందికదాని"

"అది నాదేనండి బావు- ఏ దొంగ నాకొడుకో ఎత్తుకొచ్చి అమ్మేసినాదేమో నండి. బావు సత్తెపెమాణంగా నాదేనండి మేక — మొన్నటేల 'గరువు'లో మేకల్ని మేపుతోంటే రాఘవరావుగారు వూళ్ళో కంపేరండి తిరిగొచ్చేసరికి మేక నేదండి ఆ కాపుగార్ని కూడా అడగండి నా మాట అబద్ధవనుకుంటే"

"నువ్వు చెప్పేది నిజవే కావచ్చురా- మరి నేను చెప్పేది కూడా నిజవే కదా? మరిలా ఎలా జరిగిందంటావ్?"

"ఏమోనండిబావు- అంతా అయోమయంగా వుంది ఇంటికాడ పిల్లమేక గడ్డి తిండంలేదు నీళ్ళు తాగడం నేదు బావు- తమరు కరునించాల పేద ముండావోడ్ని!"

"దానికి నేనేం చెయ్యన్రా అంతగా ఆ మేకే కావాలంటే డెబ్బై రూపాయ లిచ్చి పట్టుకుపో లాభం ఇవ్వొద్దులే"

"నా బతుకంతా పోజేస్తే అంత డబ్బు రాదయ్యగారు- ఇంక నేనెక్కడ్నుంచి తేను సెప్పండి?" ఇంకొన్నాళ్ళు పోయినాక ఆ మేకనమ్మి పిల్లదానికి చీరముక్క కొందావను కుంటున్నామండి అది ఇట్టున్నప్పట్నుంచీ"

"నీ సొదకేంలేగాని వున్న మాట చెప్పేను ఆ తర్వాత నీ ఇష్టం. మా చేలోపడి మేం కట్టేసివుంటే ఇచ్చేసే

వాడ్ని. కాని డబ్బిచ్చి కొనుక్కున్నా నాయె. ఎలా ఇస్తాను?"

భూషణంగారు లేచారు.

"బావు౯"

"సంగతి చేప్పేనుగా – ఆ తర్వాత నీ ఇష్టం"

కళ్ళనీళ్ళు కుక్కుకుని నిలబడిపోయాడు అప్పుడు. తర్వాత నిలబళ్ళేక అక్కడే కూలబడిపోయి వెక్కి వెక్కి ఏడ్చాడు. ఇదేం న్యాయం? అంటూ ఆ వూరి అమ్మవార్నీ నెత్తిమీది సూర్యనారాయణ మూర్తినీ కూడా అడిగేడు గాని ఆ ఇద్దరూ పెదవి విప్పలేదు.

గుండెలు తరుక్కుపోతూంటే దుఃఖం ఎగిసెగిసి పడుతోంటే శరీరం నిండా నిస్సత్తువ ఆవరిస్తోంటే చేతికర్ర సాయంతో నడవలేక నడుస్తూ మునసబు గారింటి కెళ్ళి ఆయన్తో అంతా మొర బెట్టుకున్నాడు అప్పుడు.

ఆ వూళ్ళో 'పెద్ద' వాళ్ళకీ 'చిన్న' వాళ్ళకీ మధ్య ఏం గొడవ జరిగినా ఏం తగవులొచ్చినా ప్రెసిడెంటుగారూ మునసబుగారూ కరణంగారితో కూడిన 'పంచాయితీ'యే వాటిని పరిష్కరిస్తూండటం ఆనవాయితి. వారి తీర్పుని కాదనగల దమ్ములు ఏ పేదవాడికీ లేదన్నది ప్రతిసారీ ఋజువవుతోన్న సత్యం!

"సరేరా. రేపు భూషణానిక్కూడా కబురంపి పిలిపిస్తాన్లే. ప్రెశిడెంటు వూళ్ళో లేడనుకో అయినా నేనూ కరణమూ కలిసి పంచాయితీ పెట్టి విచారిస్తాం లే – రేపురా" అన్నాడు మునసబుగారు.

"మీ దయబావు౯" అని వెళ్ళిపోయాడు అప్పడు.

అసలేం జరిగిందంటే –

రాఘవరావుగారి పనిమీద అప్పడు వూళ్ళో కెళ్ళేక మేకలు రెండూ మేస్తూ మేస్తూ కొంచెం దూరంలో వున్న ఆకు మళ్ళో పడ్డాయ్ అంతలో అటువచ్చిన ఓ పాలేరు మేకల్ని చూచి తిడుతూ పరుగునొచ్చి కర్ర విసిరాడు. దాంతో తల్లి మేక ఒకవైపూ చిన్నమేక ఒకవైపూ పరుగెత్తాయ్. అయినా కోపంతీరని పాలేరు పెద్దమేకని కొంత దూరం తరిమాడు. అది చేల గట్లంట పరుగు తీసింది. అలా చాలా దూరంవెళ్ళి వెనక్కి చూసేసరికి తన పిల్ల జాడెక్కడా కన్పించలేదు. దిక్కుతోచక తిరుగుతూంటే ఆ ప్రక్కనేవున్న కొబ్బరి చెట్టెక్కి కాయలు తీసుకుని తాగుతున్న భూషణంగారబ్బాయి చూశాడు దాన్ని. వాళ్ళ ఆకుమడి కూడా ఆ ప్రక్కనే వుంది. దాన్నలా వదిలేస్తే ఆకుమడిలో పడుతుందని మెల్లగా వెళ్ళి మేకని పట్టుకుని ఇంటికి లాక్కొచ్చాడు.

భూషణంగారంతా విని "కట్టేసెయ్. వెధవలు మేకల్ని ఆకుమళ్ళ మీదకి వదిలెయ్యడం నేర్చారు," అన్నాడు.

ఆ మర్నాటికూడా ఎవరూ ఆ మేక తమదంటూ రాకపోవడంతో పాలేర్లు మేక ఎక్కడిదని అడుగుతూండటంతో అమ్మాయి పెళ్ళిలో చేసే విందుకి పనికొస్తుందిలే అని 'కొన్నాన్నా' అన్నారు ;

అదీ జరిగింది.

ఇంటికెళ్ళి జరిగిందంతా భార్యతో చెప్పుకుని బావురుమన్నాడు అప్పడు

"మున్సబుగోరు మా దొడ్డమనిషి. మనకి తప్పకుండా న్యాయం సేత్తారు గాని నువ్వూరుకో," అంటూ ఓదార్చిందా ఇల్లాలు.

మర్నాడు తెల్లారడం పాపం మేక పిల్లతో సహా మునసబుగారి యింటి కెళ్లాడు అప్పడు.

"అప్పుడే తెల్లారిందిట్రా నీకూ" అన్నాడు ఆశ్చర్యంగా మునసబుగారు.

తలొంచుకున్నాడు అప్పడు.

"సర్లే కూర్చో."

మునసబుగారింటి ముందు ఓ ప్రక్కగా వున్న వేపచెట్టు మొదట్లో కూలబడ్డాడు అప్పడు. మేకపిల్లని ఒళ్ళోపెట్టుకుని. చేతికర్ర కూడా అతడి ప్రక్కనే నీరసంగా పడుకునుంది.

కొంచెం సేపటికి కరణంగా రొచ్చారు.

చాలా గ్రామాల్లో రెండు ముఠా లుంటూంటాయ్. సాధారణంగా ఒక ముఠాకి మునసబుగారూ రెండో ముఠాకి కరణంగారూ మకుటంలేని మహారాజు లుగా చెలామణీ అవుతూంటారు. కాని ఆ వూళ్లో ఇద్దరిదీ ఒక ముఠాయే. వారి దీవెన్లతోనే బలరామయ్యగారు ప్రెశిడెం టయ్యారు. పేరుకాయన ప్రెశిడెంటైనా వ్యవహారాలు చక్కబెట్టే ఈ గ్రామాధి కారులే కావలపినంత ఆస్తివున్న బల రామయ్యగారి కూడా ప్రెశిడెంటు హోదా కావాలి తప్ప ఇంకేం అక్కర్లేదు. అసలాయన ఎక్కువగా పట్నంలోనే వుంటూంటాడు కూడా. అయినా ఆయన 'పెద్ద' రికాన్ని మన్నిస్తూనే తమ పబ్బం గడుపు కుంటూంటారు వీళ్ళు. గ్రామ తగాదాలు పరిష్కరించేది కూడా వీళ్ళే ;

మునసబు కరణాలిద్దరూ ఏదో విషయాలను గురించి ముచ్చటించు కొంటూండగా భూషణంగా రొచ్చారు ఆయనో మోతుబరి రైతు. ఆయన్ని 'గౌరవించేలా' గౌరవించకపోతే వూరి రాజకీయాల్లో చాలా మార్పులు వీలైతే చీలికలుకూడా వస్తాయని వారికి తెలుసు అంచేత లేచి ఆయన్ని ఆహ్వానించి అరుగుమీద కుర్చీలో కూర్చోమన్నారు.

మునసబుగారు పిచ్చాపాటీ మాట్లాడ బోతోంటే "ముందు నన్నెందుకు పిల్చారో చెప్పండి మునసబుగారూ - ఆ వెధవలంజాకొడుకు నన్ను పంచా యితీలో పెడతాడా అని? వాడి అంత

స్తేమిటీ నా అంతస్తేమిటి? నేను విసిరే గింజలు ఏరుకుని తినే ఈ మా దచ్చోచ్ నా మాటని పవాలు చేస్తాడా అని? వెధవ మేకకోసం నేను అబద్ధమాడేనంటాడా ఈ దొంగముండా కొడుకు?" అంటూ త్రాచులా లేచారు భూషణంగారు.

"వూరుకోవయ్యా బాబూ ...." అంటోన్న మునసబుగారి మాటల్ని విన్పించుకోకుండా, "నా ఒళ్ళు మండి పోతోంది మున్సబుగారూ. నన్ను కాదనే వాడింకా ఈ గడ్డమీద పుట్టలేదు...." అంటూ రెచ్చిపోతోంటే వూరుకోమంటూ ఆయన్ని శాంతింపజేసి గ్లాసుడు మంచి నీళ్ళందిచ్చి "నీకెందుకు నువ్వూరుకో ఇవతల మేం వున్నాంగా" అని అభయం కూడా ఇచ్చి కరణంగారి వంక చూసి నవ్వారు మునసబుగారు.

"ఏరా అప్పిగా" పిల్చాడాయన.

"అయ్యా!" అంటూ వురికి వచ్చాడు అప్పుడు మేకపిల్లని ఎత్తుకుని.

"అయితే ఏమిటంటావ్ నువ్వు?"

మళ్ళీ అంతా ఏకరువు పెట్టాడు అప్పడు.

"మరి నువ్వేమంటావోయ్" భూషణంగార్నడిగారు మునసబుగారు.

"వాడే చెప్పేడుగా నేనేమన్నదీ. ఆ మేక అమ్మకానికొచ్చిన మాట నిజం. నేను డెబ్బై రూపాయలకి కొన్నమాట నిజం. మా అమ్మాయి పెళ్ళికి పనికొస్తుం దని కొన్నాను."

"బహుశా ఎవడో వీడి మేకని తస్కరించి భూషణంగారికి అమ్మివుండ వచ్చు. అంటే భూషణంగారు నిర్దోషన్న మాటే కదా?" కరణంగారన్నారు జనాంతికంగా.

"అదీ పాయింటే అనుకోండి. పోనీ నీ మేకకి గుర్తులేమన్నా వున్నాయిట్రా?"

"నల్లమేక బావూ, అంతా నల్లగా వుంటుందయ్యగారూ."

"అదిచాలదోయ్ ఇంకేమైనా గుర్తులు చెప్పాలి."

"మేకని తీసుకొస్తే పిల్ల గుర్తు పడద్దండి."

అప్పడి మాటలకి మునసబుగారు భూషణంగారివంక చూశారు. ఆయన కాస్త కంగారుపడ్డారు. తర్వాత "కావలిస్తే తెప్పించండి" అన్నారు కాస్త విసుదుగా.

"అంత కంగారెందుకూ. న్యాయం నీ పక్షాన వుంది— వూరుకో" మెల్లగా అని ఆయన్ని 'సవరించి' తన పాలేర్ని పంపి మేకని తెప్పించారు.

తల్లిని చూచి బిడ్డా, బిడ్డని చూచి తల్లీ సంబరంగా ఒకరి మెడకింద ఒకరు ఒదిగిపోయి శరీరాన్ని ఆప్యాయంగా నాకుకోసాగాయి మేకలు.

"తమరే సూడండి బావూ, అది నా మేకే బావూ."

భూషణంగారి మొహం కందగడ్డ అయ్యింది. మిగిలిన ఇద్దరి మొహాలూ కొంచెంగా నల్లబడ్డాయ్

"కరణంగారన్నట్టు అది నీదే అయ్యుండొచ్చు. కాని దాన్ని భూషణం గారు కొన్నానంటున్నారు కదా. పోనీ నీ మేకనాయన దొంగిలించాడంటావా ?" మునసబుగా రడిగారు.

"ఆరికేం లోటనండీ నా మేకని దొబ్బుతారూ ?"

"మరి ఒప్పుకున్నావు కదా ? పోనీ ఇలా జరిగిందని చెప్పడానికి సాక్షులూ లేరు. అంచేత జాగ్రత్తగా అన్ని విష యాలూ ఆలోచించి మేం తీర్పుచెబుతాం" అనీ అందరి మొహాల్లోకీ ఓసారి చూసి కరణంగారితో గుసగుసలాడిన పిమ్మట ఇలా అన్నారు మునసబుగారు. "పిల్ల మేక తల్లి మేకని గుర్తించింది గనుక ఆ మేక అప్పడిదే అని మేం విశ్వసిస్తున్నాం "

"దండాలు బావు(" చేతులు జోడిం చాడు అప్పడు అతడి కళ్ళల్లో ఆనందపు వెన్నెల విరగకాస్తోంది

పులిక్కిపడి లేచారు భూషణంగారు కుర్చీలోంచి.

"కానీ-నాగభూషణంగారు ఆ మేకని డెబ్బై రూపాయలకి కొన్నారన్నదికూడా నిజమేనని మేం భావిస్తున్నాం. అంచేత ఎవరి పక్షాన తీర్పుచెప్పినా రెండోవారికి అన్యాయం జరుగుతుందని మాకు తెలుసు. అంచేత బాగా ఆలోచించిన మీదట ఒక నిర్ణయానికొచ్చాం. పూర్వం నుంచీ వస్తోన్న ఈ పంచాయితీ తీర్పుని మీరిద్దరూ గౌరవిస్తారని ఆశిస్తూ మా తీర్పుని చెబుతున్నాం. అదేమిటంటే తనకి మేక కావాలంటే భూషణంగారికి యాభై రూపాయలిచ్చి తన మేకని తోలుకుపోవచ్చు. లేనిచో పెద్దలందరి ముందూ మేకని మనూరి గ్రామదేవత ముందు బలిచ్చి మాంసాన్ని అయిదు వాటాలేసి భూషణంగారికీ, అప్పడికీ, పంచాయితీ పెద్దలకీ సమానంగా పంచాల్సిందిగా నిర్ణయిస్తున్నాం." అన్నారు మునసబుగారు.

భూషణంగారు సంతోషించడం చూచి తృప్తిగా గాలిపీల్చుకున్నారు మునసబు గారు.

"బావూ(! ఇదన్యాయం బావూ(. నా మేకనమ్మి నా బిడ్డకి చీర కొనాలనుకున్నా బావూ( - నా మేకని నా కివ్వడమే దరమం బావూ( - దరమపెబువులు దయ జూపాలి పేదోడ్ని !" వేడుకుంటూ అన్నాడు అప్పడు

"రేయ్ - పంచాయితీ తీర్పుకి తిరుగు లేదురా" కరణంగారన్నారు "ఇష్టే యాభై రూపాయలు తెచ్చి భూషణం గారికిచ్చి మేకని తోలుకుపో. లేదా మేకని అమ్మవారికి బలిద్దాం పుణ్యం పురుషార్థంకూడా కలిసొస్తాయ్"

"కూటికి టికాణా లేనోడ్ని అంత డబ్బెక్కడ్నుంచి తేనయ్యగారూ ముసలి పీనుగుని!"

"అంచేతే రాండోదే ఖాయంచేసేద్దాం. ఇప్పుడైనా ఫర్లేదు కరణంగారి వాటా ఎలాగూ సాయిబుకి అమ్మేస్తారు కదా నీ వాటా కూడా అలాగే అమ్మేసి ఆ డబ్బుతో చీరో రవికో కొనియ్యి నీ కూతురికి" వుచిత సలహా ఇచ్చారు మునసబుగారు

దెబ్బతిన్నట్టు చూశాడు అప్పడు.

"నా మేకని నా కిప్పియ్యడానికి యాభై రూపాయలు ఆరి చేతిలో పొయ్యాలా బాపూ? నా మేకని సంపి మాంసాన్ని మీకూమీకూ పంచి ఇన్నాళ్లూ మేకని సాకినందుకింత మాంసం తీసుకోవాలా బాపూ నేను? ఇదేం నేయం బాపూ!"

ముగ్గురూ అదిరిపోయారు.

"ఏమిట్రోయ్ లాపాయింట్లు లాగేస్తున్నావ్. ఈ పంచాయితీ మాటంటే ఆ పరమేశ్వరుడి మాటే" లేస్తూ అన్నారు కరణంగారు.

ఆయన మాటల్ని పట్టించుకోలేదు అప్పడు. తలతిప్పి ఆ తీర్పుగురించి తెలీక సంతోషంతో పాలుతాగుతోన్న మేకపిల్లనీ దాని వీపు నాకుతోన్న మేకనీ చూశాడు చూసి ఏదో నిర్ణయానికొచ్చి వంగి నేలమీద పడున్న చేతికర్ర అందుకున్నాడు.

అరుగుమీద కూర్చున్న పెద్దలు ముగ్గురూ వులిక్కిపడి మొఖమొఖాలు చూసుకున్నారు.

"బాపూ - నా మేకని అమ్మేయాలనుకున్నా పిల్లది పాలిడిచేకే అమ్మాలనుకున్నాను గాని ఇప్పుడే అమ్మేసి ఈ పిల్లదాని నోట్లో మన్నుపొయ్యాలనుకోలేదు బాపూ. బాపూ! నాది తప్పైతే నాను అబద్ధం ఆడితే నానే పోతాను బాపూ లేపోతే- లేపోతే ఆరే పోతారు. బాపూ! మేక కండలు కోసి మీరూ మీరూ పంచుకోకండి. పిల్లదాన్ని నాల్రోజులు బతకనీండి బాపూ. నా కట్టం పోయిందనుకుంటానుగాని బాపూ ఈ పిల్లదాన్ని కూడా ఆర్నే తీసుకోమనండి దాంతో అర్ని మేళ్ళు కట్టుకోమనండి. నానెప్పుడూ టీదోడ్ని. ఈ మేకపిల్ల నేకపోతే ఇంకా సెడిపోను బాపూ. ఆర్నే తీసేసుకోమనండి. ఆ మేక నాది కాదు ఆ పిల్ల నాది కాదు ఆర్నే తీసేసుకోమనండి! ఆర్నే తీసేసుకోమనండి!"

విసుడిగా వెళ్ళిపోయాడు అప్పడు.

